క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సాయం



పామర్రు(తోట్లవల్లూరు): సామాన్య స్థాయిలో ఉన్న విద్యార్థులు సైతం తమ జీవితంతో పాటు కుటుంబం కూడా అత్యున్నత స్థితికి ఎదిగే అవకాశం చదువుద్వారా మాత్రమే ఉంటుందని సుధీర్ టింబర్స్ అధినేత నూకల వెంకట సాంబశివరావు అన్నారు. స్థానిక యాకమూరులోని సుధీర్ గ్రూప్ కార్యాలయంలో నూకల వెంకటసాంబశివరావు కుమారుడు వంశీకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్జీ సిద్ధార్థ కళాశాల్లో ఎంఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎండీ సులేమాన్‌కు రూ.5వేల సాయాన్ని నూకల లింగమూర్తి, వెంకటసుబ్బమ్మ సంస్మరణతో విద్యాప్రోత్సాహక కానుకగా అందజేశారు.

టెన్నికాయిట్ పోటీలకు కానుకొల్లు విద్యార్థులు



మండవల్లి: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలకు కానుకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం మాధవకుమార్ శనివారం తెలిపారు. పెదపాలపర్రులో జరిగిన ఎస్జీఎఫ్ టెన్నికాయిట్ పోటీల్లో బాలుర సీనియర్ విభాగంలో జి.నాగసాయి, జి.మోహనశివ, ఎస్.డేవిడ్, శశిధర్, జూనియర్ విభాగంలో కె.కృష్ణవంశీ, నవదీప్, పి.అఖిల్‌రాజు ఎంపికయ్యారని పేర్కొన్నారు. బాలికల సీనియర్ విభాగంలో రుక్మిణిదేవి, జి.సౌమ్యకీర్తి, కె.దుర్గాభవాని, జూనియర్ విభాగంలో ఎస్.కావ్య, ఎస్.తేజస్విని, వి.వైష్ణవి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వీరిని హెచ్ఎం మాధవకుమార్, పీడీ సత్యనారాయణ అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 428 మందికి రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ వైద్యులు సేవలను రోగులకు అందించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



పామర్రు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో శనివారం ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని వృద్ధుడు ఏ ప్రాంతానికి చెందిన వాడో అని ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు. వృద్ధుడి వయస్సు సుమారు 75 ఏళ్లు ఉండవచ్చని ఎస్ఐ అవినాష్ తెలిపారు.

ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు శ్రీకారం



కూచిపూడి(మొవ్వ): గుడివాడ–చల్లపల్లి–కొత్తపాలెం రహదారి ప్యాచ్ వర్క్ కార్యక్రమాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం నిర్వహించారు. ఒక కోటి 40 లక్షల రూపాయలతో జరిగే ఈ అభివృద్ధి పనుల భూమి పూజా కార్యక్రమాన్ని ఆర్అండ్‌బీ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధి సభలు

గుడ్లవల్లేరు: ఉపాధి హామీ పథకం కింద గుడ్లవల్లేరు మండలంలోని గ్రామాల్లో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు చేయబోయే ఉపాధి పనులపై సభలను నిర్వహించనున్నట్లు ఏపీఓ పి.రాంప్రసాద్ శనివారం తెలిపారు. 4వ తేదీన పెంజెంద్ర, పోలిమెట్ల, కూరాడ, కూచికాయలపూడి, చిత్రం, శేరీ కల్వపూడి, 5న చంద్రాల, చినగొన్నూరు, శేరీ దగ్గుమిల్లి, పురిటిపాడు, విన్నకోట, కట్టవానిచెరువు, 6న డోకిపర్రు, గాదేపూడి, మామిడికోళ్ల, వేమవరం, వెణుతురుమిల్లి, ఉలవలపూడి, 7న గుడ్లవల్లేరు, వడ్లమన్నాడు, వడ్లమన్నాడు, కొతవరం, అంగలూరులో సభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జంక్ ఫుడ్‌తో అనారోగ్యం

పట్టించుకోని ఆహార తనిఖీ అధికారులు

మార్కెట్లో చిన్నారుల ఆరోగ్యాన్ని హరించే స్నాక్స్‌ను ఆకర్షణీయ ప్యాకెట్లలో విక్రయిస్తున్నారు. ఈ జంక్‌ఫుడ్ నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే కచ్చితంగా వ్యాధులు రాక తప్పదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

గుడ్లవల్లేరు: పిల్లలు తినే స్నాక్స్‌లో అత్యధికంగా ఉప్పు, కారాలు దట్టిస్తున్నారు. వీటిని ఆకర్షణీయమైన ప్యాకింగ్స్ ఉంచి విక్రయిస్తున్నారు. ఈ స్నాక్స్‌ను నిరోధించే ఆహార తనిఖీ అధికారులు కంటికి కనబడకుండా పోయారు. చిప్స్, రింగ్స్, క్రేజీ బాల్స్, గిఫ్ట్ చాక్లెట్, కుర్‌కురే, కరాచి, ఫింగర్ స్టిక్స్ ఒకటేమిటి ఇలా ఎన్నో పేర్లతో జంక్ ఫుడ్‌కు సంబంధించిన స్నాక్స్ తళతళలాడే రంగురంగుల ఆకర్షణీయమైన ప్యాకుల్లో మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇవి తినని పిల్లలు లేరంటే ఏ మాత్రం అతిశయోక్తి లేదు. బేకరీ, ఫుట్‌పాత్, టీ స్టాల్, కిరణా దుకాణాల్లోనే కాకుండా గంపల్లో వ్యాపారం చేసే చిరు వ్యాపారుల వద్ద సైతం ఈ స్నాక్స్ ప్యాకెట్లు పిల్లలకు దొరుకుతున్నాయి. కేవలం ఒక్క రూపాయి నుంచి రూ.10 వరకు వివిధ సైజుల్లో దొరికే ఈ ప్యాకెట్లను పిల్లలు ఎంతో ఇష్టంగా తింటున్నారు. అవి చూడగానే పిల్లలకు నోరూరెలా ప్యాకింగ్‌ను రంగు రంగులుగా ఆకర్షణీయంగా తయారీలోనే తీర్చి దిద్దుతున్నారు.

డబ్బు సంపాదనే ప్రాతిపదిక

పిల్లలకు ఇష్టమైన డోరేమాన్, మోటూపతులు, చోటా భీమ్ వంటి బొమ్మలను ముద్రించి చిన్నారులను ఆకర్షించి, వారి ఆరోగ్యాలను తయారీదారులు హరిస్తున్నారు. కేవలం డబ్బు సంపాదనే ప్రాతిపదికన ఫామ్‌లో లేని రకరకాల కంపెనీల పేర్లను పెట్టి ఈ స్నాక్స్ తయారు చేసి ఎగుమతులు చేయటంతో పిల్లలకు ఇవి జబ్బులకు దారి తీసే విధంగా ఉన్నాయి. శరీరానికి ఎంత అనారోగ్యమైనా.. పిల్లలు తినే స్నాక్స్‌లో బ్రాండెడ్‌గా ఫీలయ్యే కుర్‌కురే, కరాచి, చిప్స్ వంటి స్నాక్స్ అమ్మితే ఒక ప్యాకెట్‌కు 50పైసలే ఆ వ్యాపారికి కమీషన్ వస్తుంది. ఇంకా నాసిరకం స్నాక్స్ అమ్మితే అదే వ్యాపారికి రెట్టింపుగా ప్యాకెట్‌కు ఒక రూపాయి మిగులుతుంది. కల్మషం లేని పిల్లలకు నాసిరకం స్నాక్స్‌ను అంటగట్టేందుకే వ్యాపారులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆహార తనిఖీ అధికారులు మాత్రం పిల్లల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలున్నాయి.



పిల్లలు తినే జంక్ ఫుడ్

మార్కెట్లో చిరుతిళ్లు తినొద్దు



మార్కెట్లో దొరికే జంక్ చిరుతిళ్లను పిల్లలు తినకుండా వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. నిల్వ ఉండటానికి ఆ స్నాక్స్‌లో రసాయనాలను దట్టిస్తారు. రుచి ఎక్కువగా ఉండేందుకు అధిక మోతాదులో మసాలాలు, టేస్టింగ్ సాల్ట్ కలుపుతారు. రంగుల కోసం వివిధ రకాల పౌడర్లను చల్లుతారు. వీటిని పిల్లలు తింటే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలే.

– డాక్టర్ బొప్పన శ్రావ్య, వైద్యాధికారి, కొతవరం పీహెచ్‌సీ

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



జంక్ ఫుడ్‌కు సంబంధించిన స్నాక్స్‌కు పిల్లలతో పాటు పెద్దలు కూడా దూరంగా ఉంటే చాలా మంచిది. వాటిలో కలిపే వివిధ రకాల రసాయనాలు, రంగుల వలన ఇబ్బందులు తప్పవు, ఇవి తినే పిల్లలకు ఎసిడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలు తక్షణం సంభవించే పరిస్థితులు కూడా ఉన్నాయి.

– ఎస్.గోపాల్ నాయక్, వైద్యాధికారి, గుడ్లవల్లేరు పీహెచ్‌సీ

కార్తిక మాస పూజలు ప్రారంభం



లింగాల విశ్వేశ్వర స్వామికి పూజలు



కొతవరంలో గౌతమేశ్వరునికి పూజలు



పామర్రులో ఆకాశ దీపాన్ని వెలిగించి ప్రారంభిస్తున్న భక్తులు

మండవల్లి: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక మాసం ప్రారంభమైన సందర్భంగా శనివారం పూజలు నిర్వహించారు. లింగాల విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకుడు సుదర్శన శరత్ బాబు విశేష పూజలు చేశారు.

ఆకాశ దీపాలు ప్రారంభం

పామర్రు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శనివారం పలు ఆలయాల్లో ఆకాశ దీపాలను ప్రారంభించారు. స్థానిక విష్ణాలయంలో భక్తులు పెరుమాళ్ల చంచయ్య, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో ఆకాశ దీపానికి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపాన్ని ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. అనంతరం ఆకాశ దీపాన్ని వెలిగించి ధ్వజస్తంభానికి ఏర్పాటు చేసిన తాడుకు కట్టి పైగి ఎగుర వేశారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు కూనపరెడ్డి భాస్కర రావు దంపతులు ఆకాశ దీపపు పూజలను చేసి దీపాన్ని ఎగుర వేశారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకులు ఆర్.భార్గవ, ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కార్తికమాసం ఆరంభం సందర్భంగా శనివారం గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయం, నగరేశ్వరాలయం, విన్నకోట భోగేశ్వరాలయం, కొతవరం గౌతమేశ్వరాలయాల్లో స్వామివార్లకు వేద మంత్రోచ్ఛరణ నడుమ అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



గుడివాడలో స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం శనివారం వేకువ జాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. పాలకమండలి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలను నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వర స్వామి దేవస్థానం, గౌరీశంకరపురం లోని గౌరీశంకర స్వామి ఆలయం, బేతవోలు లోని శ్రీ ఆనందేశ్వర స్వామి వారి దేవస్థానాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్వామి వార్లకు అభిషేకాలు గావించి భక్తుల దర్శనానికి ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు

రగ్బీలో జమీదగ్గుమిల్లి విద్యార్థుల ప్రతిభ

జమీదగ్గుమిల్లి(పామర్రు): జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో తమ జమీదగ్గుమిల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని ఆ పాఠశాల హెచ్ఎం టీఎస్. హనుప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలోని జెడ్పీ హైస్కూల్లో విజేతలను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీన గూడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో విద్యార్థులు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. అండర్–17 బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థినులు కూనపరెడ్డి సుష్మా మైత్రేయి, కోనా శివ నందిని ఎంపికయ్యారని తెలిపారు. అండర్–14 బాలికల విభాగంలో తొమ్మిదో తరగతికి చెందిన వెన్నపు మృదులశ్రీ, 8వ తరగతి లంకపల్లి హని, బాలుర విభాగంలో 8వ తరగతి లంకపల్లి ఈశ్వర్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. విజేతలను, వీరికి శిక్షణ ఇచ్చిన పీడీ బి.రాముసు హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

గుడివాడరూరల్: జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ సీహెచ్ నరసింహులు అన్నారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం, లేగ దూడల పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుపోషణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ పశు పోషకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఉచిత వైద్యశిబిరాలు, పశువుల కొనుగోళ్లకు సబ్సిడీ రుణాలు అందిస్తుందన్నారు. వైద్య శిబిరంలో వట్టిపోయిన పశువులు గర్భందాల్చేలా 49 పశువులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లేగ దూడలకు అందాల పోటీలు నిర్వహించగా 20 లేగదూడలు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందించారు. పశుసంవర్ధకశాఖ డీఎల్‌డీఏ డాక్టర్ శ్రీనివాసులు, గుడివాడ డీడీ సి.శ్రీనివాస్, తూర్పుకృష్ణా డెల్టా కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, మండల పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు, పశు వైద్యులు లక్ష్మీనారాయణ, చైతన్య, రామకృష్ణ, వేణు పాల్గొన్నారు.



పశు పోషకులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సీహెచ్ నరసింహులు

కొండిపర్రులో రీసర్వే గ్రామ సభ

కొండిపర్రు(పామర్రు): గ్రామ సభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని మండల రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ వేమూరి గంగాధర్ పేర్కొన్నారు. మండలంలోని కొండిపర్రులో రీ సర్వే గ్రామసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ సభలో 19 దరఖాస్తులు వచ్చాయని, వీటిని సత్వరమే పరిష్కరించే దిశగా తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో అనిత, గ్రామ సర్వేయర్ రెహనా బేగం, గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరాంజనేయులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు

గుడివాడరూరల్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెంలో ఇటీవల తాగునీటి చెరువు ఖాళీ చేసినందున, దానిని శుభ్రం చేసి వెంటనే తాగునీరు నింపేందుకు జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. తాగునీటి చెరువుతో పాటు ఫిల్టర్‌బెడ్‌లను కూడా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి బి.కోటయ్య పాల్గొన్నారు.

రాజకీయ కోణంలో అభివృద్ధిని చూడొద్దు

కైకలూరు: నియోజకవర్గంలో జరిగే అభివృద్ధిని రాజకీయకోణంలో చూడవద్దని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత ఎంపీపీ మండల ప్రగతిని వివరించారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.28 కోట్లు వచ్చాయని తెలిపారు. మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. పుల్లవ డ్రెయిన్ అభివృద్ధికి రూ.కోటి 40 లక్షలు కేటాయించామని తెలిపారు. కైకలూరు రహదారిలో ఆక్రమణ దుకాణాలు, పంట కాల్వలలో వ్యర్థాలు పడవేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, ఎంపీడీఓ ఫణింద్ర, సర్పంచ్ మేరీ నవరత్నకుమారి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

మండల పరిషత్ సర్వసభ్య సమావేశ డయాస్‌పై ఇతరులు కూర్చొనేందుకు ప్రొటోకాల్ ఒప్పుకోదు. గత ప్రభుత్వంలో కూడా రాజకీయ నాయకులకు అవకాశం కల్పించలేదు. కామినేని పాల్గొన్న సమావేశంలో కూటమి నేతలు నలుగురు వేదికపై కూర్చున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు చివరన కూర్చోవాల్సి వచ్చింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

దళితుల మనోభావాలకు భంగం కలిగించొద్దు

కైకలూరు: వైఎస్సార్ నగర్ శివారు కరకట్ట వద్ద నూతన డంపింగ్‌యార్డు రోడ్డుకు వేస్తున్న చెత్త దళిత క్రైస్తవ బంధువుల సమాధులపై పడుతోందని, చెత్తను పూర్తిగా తొలిగించి తమ మనోభావాలను గౌరవించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం పలువురు దళితులు వినతిపత్రం అందజేశారు. క్రైస్తవ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు దానం నవరత్నకుమారి, సుధ, కిషోర్, ఆనంద్, రవిప్రకాష్, వినోదరావు, జాన్ మిల్టన్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **దంప్‌యార్డు పూర్తి ప్రక్షాళన చేస్తాం**



గుడివాడ టౌన్: స్థానిక ఏలూరు రోడ్‌లోని మున్సిపల్ డంప్‌యార్డు పూర్తి ప్రక్షాళన చేస్తామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలిసి డంప్‌యార్డును పరిశీలించారు. దానిని తక్షణ ప్రక్షాళన చేసేందుకు ఏ విధమైన చర్యలు చేపట్టాలనే దానిపై ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ శివాజీ, ఏఈ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్ఎస్ అప్పారావు పాల్గొన్నారు.

■ **స్వచ్ఛందంగా శ్మశాన వాటికకు మరమ్మతులు**

గుడ్లవల్లేరు: మండలంలోని కూరాడ దళితవాడలో గ్రామస్తులే స్వచ్ఛందంగా శ్మశాన వాటికకు మరమ్మతులు నిర్వహించారు. శనివారం సమాధుల పండుగ కావటంతో విశ్వాసులంతా ప్రార్థనలు చేసుకునేందుకు తామంతా సంయుక్తంగా శ్మశాన వాటికకు మరమ్మతులను చేపట్టారు. తమ దళితవాడలో సమస్యలు పరిష్కరించే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపించారు. అందుకే తామే తమ శ్మశాన వాటికకు మరమ్మతులను స్వచ్ఛందంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

■ **నిత్యాన్నదానం ప్రారంభం**

ముదినేపల్లి రూరల్ : మండలంలోని శ్రీహరిపురం శ్రీషిర్డీ సాయిబాబా మందిరం వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్తికమాసం సందర్భంగా వివిధ మాలధారులకు ఈ అన్నదానం చేస్తారు. కొరగుంటపాలేనికి చెందిన అచ్యుత రాంబాబు, రత్నకుమారి దంపతులు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

■ **బీమా స్వచ్ఛందంగా నమోదు చేసుకోండి**

ముదినేపల్లి రూరల్ : 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా నమోదుకు రైతులు ప్రీమియం చెల్లించాలని ఏఓ బి.వేణుమాధవ్ అన్నారు. కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన దిగుబడి ఆధారిత స్వచ్ఛంద నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. రబీ సీజన్లో సాగుచేసే వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలను నోటిఫైడ్ పంటలుగా తీసుకున్నట్టు తెలిపారు. వరికి ఎకరానికి రూ.500, మొక్కజొన్నకు రూ.483, మినుము, పెసరకు రూ.60 చొప్పున ప్రీమియం సంబంధిత ఇన్సూరెన్సు కంపెనీకి చెల్లించాలన్నారు. ఈ పంటలపై రుణం తీసుకున్న రైతులు ప్రీమియం సంబంధిత బ్యాంకుల నుంచి జమ చేస్తారని తెలిపారు. రుణాలు పొందని రైతులు ఉమ్మడి సేవా కేంద్రాలు, ఇతర నమోదు కేంద్రాల్లో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వరికి ప్రీమియం చెల్లింపునకు డిసెంబరు 31, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు డిసెంబరు 15వ తేదీని తుదిగడువు నిర్ణయించినట్టు చెప్పారు

■ **పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యం**

ముదినేపల్లి రూరల్ : పెరటి తోటల పెంపకంతో ఆరోగ్యకరమైన కూరలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలతో పెరటి తోటల పెంపకంపై అవగాహన సదస్సు చేవూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.

■ **అన్నసమారాధనకు రూ.50 వేలు వితరణ**



గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం అన్నసమారాధనకు భక్తులు రూ.50 వేలు వితరణగా ఇచ్చినట్లు ఈఓ గోపాలరావు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో పట్టణానికి చెందిన కుంచిపర్తి నాగశతపతిరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు కె.సత్యనారాయణ, కుమార్తె జె.వెంకట సుబ్బమ్మలు ఈ వితరణ అందజేసినట్లు తెలిపారు. ఈ మొత్తాలను బ్యాంకు డిపాజిట్ చేసి వచ్చిన ఆదాయంతో ప్రతి శనివారం జరిగే అన్నసమారాధన కార్యక్రమానికి వినియోగిస్తామన్నారు.

■ **అధిక సంఖ్యలో భక్తుల తాకిడి**



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల తాకిడి అధికమైంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

■ **హుండీ ఆదాయం రూ.3.38 లక్షలు**

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఆలయ తనిఖీ అధికారులు, దేవదాయ శాఖ గుడివాడ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ లెక్కింపులో రూ. 3,38,890 వచ్చినట్లు ఆలయ ఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. ఇవి ఏడు నెలల 11 రోజులకు సంబంధించిన కానుకలు అని పేర్కొన్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతారు

అక్రమంగా చేపలు పట్టుకున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు

గుడివాడరూరల్: కోర్టు ఆదేశాలను బేఖాతారు చేస్తూ తమిరిశ గ్రామానికి చెందిన బొప్పన వెంకటరావు, మురళీ, సతీష్‌కు చెందిన చేపల చెరువులో అక్రమంగా చేపలు పట్టుకుపోతున్నారని చెరువు కాపలాదారుడు సుధాకర్ నందివాడ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. నందివాడ మండలం తమిరిశలోని అడ్డరోడ్డును ఆనుకుని ఉన్న 16 ఎకరాల్లో చేపల చెరువులను 2017లో భూ యజమానులు యలమంచిలి సత్యనారాయణ పేరిట బొప్పన వెంకటరావు, మురళీ, సతీష్, నవీన్‌కు మార్‌రెడ్డి చేపల చెరువులు తవ్వుకోవడానికి అనుమతులు తీసుకొచ్చుకున్నారు. పక్క గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొంతకాలం చెరువుల సాగుకు జాప్యం ఏర్పడింది. 2023లో బొప్పన వెంకటరావు, మురళీలు మళ్లీ చెరువులు సాగు చేసుకునేందుకు కోర్టు ద్వారా అనుమతులు తెచ్చుకుని సాగు ప్రారంభించారు. గ్రామానికి చెందిన నెరుసు వీరాంజనేయులు మొదటి నుంచి బొప్పన కుటుంబ సభ్యులకు సఖ్యతగా ఉండటంతో చెరువు అజమాయిషీని వీరాంజనేయులకు అప్పగించారు. వీరాంజనేయులతో బొప్పన కుటుంబ సభ్యులకు విభేదాలు తలెత్తడంతో అంకన్నగూడెం గ్రామానికి చెందిన సుధాకర్‌ను చెరువు మీద నిఘా మ్యాన్‌గా నియమించారు. వీరాంజనేయులు బొప్పన కుటుంబ సభ్యులు, ఇతర రైతులు తమకు లీజుకు ఇచ్చారని తప్పుడు ధ్రువీకరణపత్రాలు తీసుకొచ్చి చెరువును ఆక్రమించుకునే ప్రయత్నించడంతో బొప్పన కుటుంబ సభ్యులు కోర్టు నుంచి చెరువుపై ఎటువంటి లావాదేవీలు జరపకూడదని స్టే తీసుకొచ్చారు. కోర్టు ఆదేశాలను పక్కనబెట్టి వీరాంజనేయులు, అతని అనుచరులు శనివారం చెరువులో ఉన్న చేపలను పట్టుకునేందుకు పూనుకోవడంతో నిఘా మ్యాన్ సుధాకర్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అతడ్ని పక్కకు తోసేసి చెరువులో పట్టుబడిని కొనసాగించారు. దీంతో సుధాకర్ ఈ విషయాన్ని బొప్పన కుటుంబ సభ్యులకు తెలియపర్చారు. ఈ విషయమై సుధాకర్ యజమానుల ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ చెరువు కాపలాదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు స్వీకరించామని, సమగ్ర విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు.



కోర్టు ఆదేశాలు ధిక్కరించి చెరువులో చేపలు పడుతున్న వీరాంజనేయుల అనుచరులు

తాగునీరు కలుషితమైనా పట్టించుకోరా?

మోపర్రు(పెదపారుపూడి): పంచాయతీ చెరువులో ఉన్న తాగునీరు కలుషితంగా మారి ప్రజలు అంటువ్యాధులబారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని మోపర్రు గ్రామస్తులు చెరువు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన జూపల్లి శేఖర్, బోయిన శివయ్య మాట్లాడుతూ వరద సమయంలో వన్నేరు డ్రెయిన్ కట్టలు తెగి పెద్ద గండి ఏర్పడింది. గండి పుడ్చకపోవటంతో తాగునీరు చెరువుల్లోకి రావటం లేదన్నారు. దీంతో కాలువ ద్వారా వచ్చే తాగునీరు చెరువుల్లోకి రాకుండా పోయింది. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



పంచాయతీ చెరువు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

■ **నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు**

పమిడిముక్కల: రైతులకు నాసిరకం ఎరువులు, పురుగుమందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని గన్నవరం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.సునీల్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. సునీల్ మాట్లాడుతూ డీలర్లంతా లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలన్నారు. నాణ్యమైన మందులు రైతులకు విక్రయించాలన్నారు.